గడువు రెండు రోజులే..

- పీఏసీఎస్ రుణాల్లో వన్ టైం సెటిల్‌మెంట్
- లబ్ధిదారుల బకాయిలో 50 శాతం మాఫీ
- రెండు మండలాల్లో రూ.1.40 కోట్ల దాకా బకాయిలు
- 1984 నుంచి పేరుకుపోయిన బకాయిలు

రాజోళి: వడ్డేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి ఎల్‌టీ రుణాలు తీసుకున్న లబ్ధిదారులు వాటిని చెల్లించకపోవడంతో బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. రుణాలు వసూలు చేసేందుకు, రుణ గ్రహీతలకు భారం తగ్గించేందుకు ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ కార్యక్రమం బకాయిలో 50 శాతం మాఫీతో గతనెల 17 నుంచి ప్రారంభించగా ఈనెల 15వ తేదీన ముగియనుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అధికారులు నోటీసులు అందజేస్తున్నారు. బకాయిలో 50 శాతం మాఫీతో అధికారులు అవకాశం ఇవ్వడంతో కొందరు ముందుకు వచ్చి చెల్లిస్తున్నారు. ఇంకా రెండు రోజులే గడువుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధికారులు పేర్కొంటున్నారు.

దీర్ఘకాలిక రుణాలు..

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు గతంలో ఇచ్చిన దీర్ఘకాలిక రుణాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. 1984లో ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, పైప్‌లైన్ల కోసం ఎల్‌టీ రుణాలను అందించారు. గతంలో కొద్ది మేర చెల్లించిన పూర్తిగా చెల్లించకపోవడంతో బకాయిల కింద పేరుకుపోయాయి. దాని కోసం అధికారులు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి వసూళ్లు చేసినప్పటికీ ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. రాజోళి, వడ్డేపల్లి మండలాల్లో బకాయిలను వసూలు చేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఏకకాల రుణ పరిష్కార పథకం కింద 50 శాతం మాఫీ చేసే వెసులుబాటు కల్పించినట్లు అధికారులు తెలియజేశారు. ఏళ్ల కింద తీసుకున్న రుణం కావడంతో అప్పు, వడ్డీ పెరిగిందని 50 శాతం మాఫీతో బకాయిదారులకు కూడా భారం తగ్గుతుందని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలు బకాయిల రూపంలో పేరుకుపోవడంతో దీర్ఘకాలిక రుణాలు సొసైటీ ద్వారా మంజూరు కావడం లేదని బకాయిలు పూర్తి అయితేనే కొత్త రుణాలకు అవకాశముంటుందని అధికారులు పేర్కొన్నారు.


రుణగ్రహీతలకు నోటీసులు ఇస్తున్న పీఏసీఎస్, కోఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి..

రుణ గ్రహీతలకు భారం తగ్గించే విధంగా 50 శాతం మాఫీతో రుణం చెల్లించే అవకాశం ఈనెల 15వ తేదీ వరకు ఉంది. రుణ గ్రహీతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వడ్డేపల్లి ప్రాథమిక సహకార సంఘం పరిధిలో ఇంటింటికి తిరిగి రుణం చెల్లించేలా అవగాహన కల్పిస్తున్నాం.

– రవి కుమార్, సీఈఓ, వడ్డేపల్లి ప్రాథమిక సహకార సంఘం

రూ. కోటికి పైగా బకాయిలు..

వడ్డేపల్లి ప్రాథమిక సహకార సంఘం ద్వారా రాజోళి, వడ్డేపల్లి మండలాల్లో దీర్ఘకాలిక రుణాలను 175 మంది రైతులు రూ.1.49 కోట్లు వివిధ రకాల ప్రయోజనాల కోసం రుణం పొందారు. వారు రుణం చెల్లించకపోవడంతో ఇప్పటివరకు తీసుకున్న అసలు కాకుండా రూ.1.52 కోట్లు వడ్డీ అయ్యింది. ఇలా పేరుకుపోయిన బకాయిలను చెల్లించాలని అధికారులు గత నెల 17 నుంచి వసూళ్లు చేపడుతుండగా 8 మంది లబ్ధిదారుల నుంచి రూ.18 లక్షలు వసూలు చేశారు. దాదాపు 30 ఏళ్లకు పైబడి తీసుకున్న రుణం కావడంతో బకాయిలు ఎక్కువ మొత్తంలో పేరుకుపోయాయని, ఇప్పుడున్న మాఫీ అవకాశంతో సులువుగా బకాయి చెల్లించుకోవాలని అధికారులు తెలియజేస్తున్నారు.

క్లుప్తంగా

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

రాజోళి: వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే తుంగభద్రా నది ద్వారా పంటల సాగుకు నీరు అందడం కష్టంగా ఉందని, రానున్న రోజుల్లో నీటి అవసరాలు పెరుగుతాయని, దాన్ని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

బాధ్యతతో మెలగాలి



గద్వాల క్రైం: హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లను గురువారం ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు. 1999 బ్యాచ్‌కు చెందిన రేఖారెడ్డి, మస్తాన్, యాకుబ్ హుస్సేన్ జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతిలో భాగంగా హెడ్ కానిస్టేబుళ్లుగా పోలీసు శాఖ ఉత్తర్వ్యులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించారు. విధినిర్వహణలో బాధ్యతగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



అయిజ: పట్టణానికి చెందిన గద్దాలె అరుణాబాయి, సుధాకర్‌రావు దంపతుల కుమారుడు జగదీష్‌రావు జ్ఞాపకార్థం మండలంలోని కేశవరంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. అదే విధంగా తల్లిదండ్రులు లేని 15 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్ రెడ్డి, చైర్మన్ బాలమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



రాజోళి: మండల కేంద్రంలోని భ్రమరాంబ ఆదీశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల కోసం బెంగళూరుకు చెందిన అగ్నూర్ లక్ష్మన్న, కుటుంబ సభ్యులు రూ.21 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దాతలకు సన్మానం చేశారు. అదే విధంగా కల్యాణ మండపంలో గ్రానైట్ బండలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగేష్, వినోద్‌కుమార్, ఆదివి స్వామి, బసవరాజు పాల్గొన్నారు.

ఆలయ ఈఓపై ఫిర్యాదు



గద్వాల: జోగుళాంబ ఆలయ ఈఓ పురేందర్ అవినీతికి పాల్పడుతున్నారని తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశాడు. ఈమేరకు గురువారం రాష్ట్ర దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి సోమరాజుకు ఫిర్యాదు చేశారు. అలంపూర్ జోగుళాంబ ఆలయం, జమ్ములమ్మ ఆలయం, పాగుంట ఆలయాలకు ఈఓగా ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ముఖ్యంగా భక్తులు ఇచ్చే కానుకలకు సంబంధించి సరైన లెక్కలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోలీస్ పహారా నడుమ అంత్యక్రియలు

శాంతినగర్ : వడ్డేపల్లి మండలం తనగల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తనగలకు చెందిన రమేష్ బుధవారం సాయంత్రం ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రమేష్ మృతదేహాన్ని తనగలకు కుటుంబ సభ్యులు తరలించారు. రోడ్డు ప్రమాదం కాకుండా హత్య అని నిర్ధారణ కావడంతో అంత్యక్రియల సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుంటాయని ముందస్తు చర్యల్లో భాగంగా శాంతినగర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్ పహారా మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ టాటాబాబు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ఎర్రవల్లి: విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి గంటా కవితా అన్నారు. గురువారం మండల పరిధిలోని వేముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాదికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. చెడు వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏంఈఓ అమీర్‌పాషా, హెచ్‌ఎం హన్మంతు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


వేములలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి గంట కవిత

ఆర్థిక మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

గట్టు: ఆర్థిక మోసగాళ్లతో ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని కౌన్సిలర్ అనూష కోరారు. గురువారం గొర్లఖాన్‌దొడ్డి గ్రామంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. నగదు రహిత లావాదేవీలను నిర్వహించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఆర్థిక మోసగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ తెలియజేయవద్దన్నారు. బ్యాంకుల ద్వారా అందించే బీమా సౌకర్యాలు ఖాతాదారులు ఉపయోగించుకోవాలని కోరారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై, ఏపీవై వంటి బీమా సౌకర్యాలు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రకాష్, శివకృష్ణ, మినీ బ్యాంకు నిర్వాహకులు సురేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


గొర్లఖాన్‌దొడ్డిలో అవగాహన కల్పిస్తున్న అనూష

కొనసాగుతున్న తనిఖీలు

అలంపూర్ : అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు కొనసాగాయి. ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో కోళ్లకు వైరస్ వ్యాప్తి పెరిగింది. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి కోళ్లతో వచ్చే వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కోళ్లతో వచ్చిన వాహనాలను వెనక్కి పంపుతున్నారు. తనిఖీల్లో భాగంగా గురువారం కర్నూల్ నుంచి అలంపూర్ చౌరస్తాకు దాదాపు 30 వేల గుడ్లతో వస్తున్న వాహనాన్ని తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. గుడ్ల వాహనాన్ని సైతం పశు సంవర్ధక శాఖ అధికారులు వెనక్కి పంపినట్లు పేర్కొన్నారు.

వాల్ పోస్టర్ విడుదల



అయిజ: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 5వ వార్షికోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈనెల 16, 17వ తేదీల్లో వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పందుల అపహరణ.. కేసు నమోదు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో పందులు అపహరించిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ టాటాబాబు తెలిపిన వివరాలు.. బుధవారం అర్ధరాత్రి బొలేరో వాహనాల్లో పందులు దొంగతనం చేసి తీసుకెళ్తున్నారన్నా సమాచారం మేరకు పందుల యజమానులు, పోలీసులు వెంబడించినట్లు తెలిపారు. దొంగలు పోలీసు, పందుల యజమానుల వాహనాలపై రాళ్లు, మట్టి, చిన్న పందులను విసిరేస్తూ తప్పించుకున్నట్లు తెలిపారు. దొంగలు రాయచూర్, ఎమ్మిగనూరుకు చెందిన వారై ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమ రవాణా సహించేది లేదు

కేటీదొడ్డి: అక్రమ ఇసుక రవాణ చేస్తే వాహనాలు పట్టుకుని కేసులు నమోదు చేస్తారు. కానీ ఇసుక తరలించకున్నా అధికారులు ట్రాక్టర్లు సీజ్ చేసి కేసులు నమోదు చేశారంటూ మండలానికి చెందిన ఓ బాధితుడు ఆరోపించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. తాజాగా ఓ ట్రాక్టర్‌ను పట్టుకుని వదిలి పెట్టినట్లు బాధితుడు ఆరోపించాడు. ఈ విషయమై ఎస్ఐ శ్రీనివాసులు వివరణ కోరగా అక్రమంగా ఇసుక రవాణ చేసే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేశారంటూ ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు.


నదీజలాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మెట్లపూజ

అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని తుపత్రాల గ్రామ శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివమాల ధరించిన భక్తులు తుంగభద్ర నదీజలాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. జ్యోతిర్లింగ మెట్ల పూజ కార్యక్రమం ఘనంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ఇద్దరిపై కేసు నమోదు

గద్వాల క్రైం: మహిళల పట్ల అనుచితంగా వ్యవహరించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో రోడ్డు మీద వెళ్తున్న మహిళల పట్ల ఇద్దరు వ్యక్తులు అనుచితంగా వ్యవహరించారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణానికి చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

గద్వాల క్రైం: పాత కక్షల నేపథ్యంలో దాడికి పాల్పడిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ గురువారం తెలిపారు. పట్టణానికి చెందిన శివ, లోకేష్‌కు పాత కక్షలు ఉన్నాయి. అయితే బుధవారం రాత్రి పాత బస్టాండ్ సమీపంలో శివపై లోకేష్‌తో పాటు మరో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రెచ్చిపోతున్న దొంగలు



ఉండవెల్లి: మండలంలోని డి.బూడిదపాడు ఆలయం, మండల కేంద్రంలోని మంజునాథ్ రెడ్డి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గురువారం తెల్లవారుజామున డి.బూడిదపాడు ఆంజనేయస్వామి ఆలయ తలుపు పగులగొట్టి హుండీలో చోరీకి పాల్పడుతుండగా గమనించిన స్థానికులు అరవడంతో పరారయ్యారు. అదే విధంగా మండల కేంద్రంలోని మంజునాథ్‌రెడ్డి ఇంట్లో నలుగురు వ్యక్తులు బీరువా పగులగొట్టి దొంగతనానికి పాల్పడగా నగదు, వస్తువులు ఏమి లేకపోవడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ విషయమై ఎస్ఐ మహేష్‌ను వివరణ కోరగా చోరీకి యత్నించారని క్లూస్ టీంతో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అలంపూర్‌లో అర్ధరాత్రి చోరీ



అలంపూర్ పట్టణంలోని 8వ వార్డులోని బీఆర్ఎస్ ఫంక్షన్ హాల్ సమీపంలోని వినోద్ కుమార్ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. తులం బంగారు చైన్, రూ.20వేల నగదు అపహరించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా బ్యాంక్ నర్సింహులు ఇంట్లో చోరీ యత్నం జరిగినట్లు తెలిపారు. వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా మహాపడి పూజ

గద్వాల: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. రుద్రాభిషేకం, రుద్రహోమం, మండప పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, అన్ని విధాలుగా అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగి వర్షాలు సకాలంలో కురిసి రైతులు పాడిపంటలతో కళకళలాడాలని మహాదేవునికి పూజలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో శివ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.


అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యే విజయుడుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యులు

అలంపూర్: అయిజ పట్టణంలో వెలసిన తిక్కవీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని నిర్వాహకులు ఎమ్మెల్యే విజయుడును ఆహ్వానించారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే గురువారం మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నమోదు ప్రక్రియ వేగవంతం చేయండి

శాంతినగర్ : అపార్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి మహమ్మద్ అబ్దుల్ గని సూచించారు. వడ్డేపల్లి ఎంఆర్‌సీ భవనంలో గురువారం ఎంఈఓ నరసింహ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థి వివరాల డిజిటలైజేషన్‌కు అపార్ నమోదు ప్రక్రియ చాలా ముఖ్యమన్నారు. అపార్ ఆవశ్యకతను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు మంజూరైన డెవలప్‌మెంట్ నిధులను సద్వినియోగం చేసుకుని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శాంతిరాజ్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అపార్ ఐడీల నమోదు..

మానవపాడు: మండలంలోని ఎస్‌వీఆర్ మెమోరియల్ యూపీఎస్ పాఠశాలలో గురువారం ఎంఎస్ కోఆర్డినేటర్ ఈరన్నగౌడ్ ఆధ్వర్యంలో అపార్ ఐడీ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అపార్ ఐడీ సమస్యలను జనరేట్ చేయడంతో వచ్చే సమస్యలను గుర్తించి వాటిని పాఠశాలలో జనరేట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీఓ మోహరునిషా బేగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మానవపాడులో ఐడీ వివరాలు నమోదు చేస్తున్న కోఆర్డినేటర్ ఈరన్నగౌడ్

ఘనంగా ఇంగ్లిష్ భాషా దినోత్సవం

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో సరోజినీనాయుడు జయంతి సందర్భంగా ఫిబ్రవరి 13న ఇంగ్లిష్ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామూర్తి, ఉపాధ్యాయులు లక్ష్మన్న, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్ : మండలంలోని ఆయా పాఠశాలల్లో ఆంగ్ల భాషా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధురాలు, ప్రముఖ ఆంగ్ల రచయిత్రి సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకుని మల్దకల్, అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌లలో ఆమె చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఇంగ్లిష్ భాష ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్, హెచ్‌ఎం నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సరోజినీ నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఈఓ రాములు మాట్లాడారు. సరోజినీ నాయుడు జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రేవులపల్లి పాఠశాలలో సరోజినీనాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ధరూరు : మండల పరిధిలోని రేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరోజినీనాయుడు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఇంగ్లిష్ భాషలో పట్టు సాధించాలని సూచించారు. అనంతరం ఎంఈఓ చితంరేవుల ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మానవపాడులో మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

జాతీయ రహదారిపై వాహనం బోల్తా

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై టైరు పేలి బొలెరో వాహనం బోల్తా పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కర్నూల్‌కు చెందిన బొలెరో వాహనం చెక్కల లోడుతో కర్నూల్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న క్రమంలో 44వ జాతీయ రహదారిపై కొట్టం కాలేజీ సమీపంలో టైరు పేలడంతో ఒక్కసారిగా బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న హైవే సిబ్బంది క్రేన్‌తో బొలెరోను రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించారు.


బోల్తాపడిన బొలెరో వాహనం

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల కట్టడి

కొత్తకోట రూరల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని పెద్దమందడి ఎస్ఐ యుగంధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్టూర్‌లో గ్రామస్తులు, దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వెల్టూర్ గ్రామం నిఘా నీడలో పనిచేస్తుందని, గ్రామం నుంచి ప్రధాన ప్రధాన జాతీయ రహదారి ఎన్‌హెచ్44 వరకు మూడు కిలోమీటర్ల మేర సీసీ కెమెరాలు పని చేయనున్నాయి. గతంలో సీసీ కెమెరాలు లాంఛనంగా ప్రారంభించినప్పటికీ కొన్ని రోజులు మాత్రమే పని చేశాయని, నిర్వహణ లోపం కారణంగా అవి పనిచేయకపోవడంతో గ్రామంలో అప్పుడప్పుడు దొంగతనాలు జరుగుతుండడంతో తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆరు కెమెరాలను రిపేర్ చేయడంతో పాటు అవసరం ఉన్న చోట కొత్త కెమెరాలు అమర్చినట్లు ఎస్ఐ తెలిపారు. సీసీ కెమెరాలు అన్నింటిని అనుసంధానంగా ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్‌కు లింక్ చేశామన్నారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గుర్తించే వెసులుబాటు ఉంటుందన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

శాంతిభద్రతల పరిరక్షణకు మండల ప్రజలు సహకరించాలని ఎస్ఐ యుగంధర్‌రెడ్డి కోరారు. బీజేపీ పెద్దమందడి మండల అధ్యక్షుడు ముప్పూరి చెన్నయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో దత్తాత్రేయరెడ్డి, కావలి అశోక్, మదిగట్ల రవి, కొత్తబోయ బాలరాజు, అనిల్‌యాదవ్, నాగరాజుయాదవ్, కరుణాకర్, అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.